సాగునీటి సంఘాల్లో ఎన్నికల వేడి

- నవంబర్ 24లోపు ఎన్నికలు పూర్తికి ఆదేశాలు
- నిడమర్రు మండలంలో 84 డీసీలు, 7 సాగు నీటి సంఘాలు
- కూటమి నేతలను సంతృప్తిపరిచే దిశగా ప్రభుత్వం అడుగులు


వెంకయ్య వయ్యేరు పంట కాలువ

నిడమర్రు: సాగునీటి సంఘాల ఎన్నికల వేడి మొదలైంది. ఈ మొత్తం ప్రక్రియ నవంబరు 24 తేదీలోపు పూర్తయ్యేలా ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేయడం ద్వారా కూటమి నేతలను ఖుషీ చేయనుంది. పల్లెపండుగ పేరుతో ఇప్పటికే గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనుల పంపకాలు, ప్రైవేటు మద్యం దుకాణాల పేరుతో బెల్ట్ దుకాణాల నిర్వహణ ద్వారా కొందరు జనసేన, టీడీపీ నేతలను సంతృప్తి పరిచిన అధికార పార్టీ సాగునీటి సంఘాల ఎన్నికల పేరుతో మరికొందరికి లబ్ధి చేకూర్చేందుకు సన్నాహాలు చేస్తోంది. నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి జలవనరుల శాఖ తాజా షెడ్యూల్ విడుదల చేసింది. ఉంగుటూరు నియోజకవర్గంలో అధికారులు ముందుగా ఓటర్ల జాబితా ప్రచురణ, ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నారు. కాల్వల నిర్వహణ, నీటి వినియోగం, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనుల కోసం ఈ సాగునీటి సంఘాలు పనిచేస్తాయని చెబుతున్నారు.

మూడు నియోజకవర్గాల పరిధిలో ఆయకట్టు

నిడమర్రు మండలంలో నీటి సంఘాల ఎన్నికల సంబంధించిన ఆయకట్టు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఉంగుటూరు, పెంటపాడు, ఉండి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 30,662 ఎకరాల్లో ఉంది. సాగునీటి పరంగా రెండు విధాలుగా ఉంది. 84 డిస్ట్రిబ్యూషన్ కమిటీలు (డీసీ) ఏడు సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఇందులోనే మేజర్ కమిటీలు, మైనర్ కమిటీలు ఉన్నాయి. ఎన్నికల సందర్భంగా ఓటర్ల జాబితా రూపొందించేందుకు ప్రతి మండలానికీ నీటి వినియోగదారుల సంఘం (డబ్ల్యూయూఏ) పరిధిలో తహసీల్దారు ఆథరైజ్డ్ అధికారిగా, ఆకట్టు రైతుల వివరాలు చూసేందుకు నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారిగా వ్యవహరించనున్నారు.

కూటమి నేతలకు మరికొన్ని పదవులు

సాగునీటి సంఘాల ఎన్నికలలో వీలైనన్ని ఎక్కువ స్థానాలు కూటమి నేతలకు దక్కేలా పార్టీ వర్గాలను స్థానిక నాయకత్వం సమాయత్తం చేస్తోంది. నియోజకవర్గం జనసేన అభ్యర్థి ఎమ్మెల్యే అవ్వడంతో ఎన్నికల సమయంలో పని చేసిన వారిలో టీడీపీ, జనసేన శ్రేణులే ఎక్కువ పాత్ర ఉండటంతో బీజేపీ శ్రేణులు పదవుల విషయంలో వెనకంజలో ఉన్నారు. కూటమి నేతల్లో కొందరికి ఇప్పటికే పలు పదవుల్లో ఆదాయ వనరులు కల్పించారు. అందులో అవకాశం దక్కని నాయకులకు సాగునీటి సంఘాల్లో చోటు కల్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. పదవులు దక్కించుకునే విషయంలో ఎక్కువ మంది జనసేన కేడర్ కంటే టీడీపీ కేడరే ముందు వరసలో ఉన్నట్టు తెలుస్తోంది.

ఉండి సబ్ డివిజన్‌లో సంఘాలు, గ్రామాలు, విస్తీర్ణం

నీటి సంఘం	గ్రామాలు	విస్తీర్ణం
నిడమర్రు	6	4288
పెదనిండ్రకొలను	6	4693
పడమర విప్పరు	6	4334
చానమిల్లి	10	4581
అడవికొలను	6	3566
వెంకటాపురం	5	4257
పెదకాపవరం	5	4943

సర్వే నంబర్ల ద్వారా ఓటరు జాబితా



సర్వే నంబర్లు ఆధారంగా రైతుల ఓటరు జాబితాను తయారు చేసేలా వీఆర్వోలకు ఆదేశాలు అందించాం. భూమి అమ్మకం కొనుగోళ్ల పరిగణలోకి తీసుకుని రైతుల వివరాలు సేకరించనున్నాం. ఆయా నీటి సంఘం ఆకట్టు పరిధిని కలర్ మ్యాప్‌ను రూపొందించి ప్రదర్శించనున్నాం. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేలా కృషి చేస్తాం.

– ఎస్ నాగరాజు, తహసీల్దార్, నిడమర్రు

నోటిఫికేషన్ జారీకి ఏర్పాట్లు

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఇప్పటికే షెడ్యూల్ విడుదల కాగా, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఎన్నికల అనంతరం అధ్యక్ష, కార్యదర్శుల ప్రకటన, బాధ్యతల అప్పగింతలు ఉంటాయి. కాల్వవల ఆయకట్టును ప్రామాణికంగా తీసుకుని తొలుత ఆయా ప్రాంతాల్లో ప్రాదేశిక నియోజకవర్గం (టెరిటోరియల్) వారీగా ఆయకట్టు ఓటర్ల జాబితా సిద్ధం చేస్తారు. అనంతరం 12 మంది టీసీల (టెరిటోరియల్ సభ్యులు), నీటి వినియోగ సంఘాలు కలిసి డిస్ట్రిబ్యూటరీ కమిటీలను (డీసీ) ఎన్నుకుంటారు.

2 ప్రధాన పంట కాల్వల పరిధిలో 7 సంఘాలు

వెంకయ్యవయ్యేరు, ఏలూరుకాలువ పరిధిలోని ఆయకట్టు పరిధిలో 7సంఘాలు ఉన్నాయి. నిడమర్రు, పెదనిండ్రకొలను, పడమర విప్పర్రు, చానమిల్లి, అడవికొలను, వెంకటాపురం, పెదకాపవరం ఆయకట్టు పరిధిలో ఉన్న గ్రామాల ఆకట్టుకు సంబంధించి ఒక్కో డీసీకి 12 చొప్పున టీసీలు ఉండేలా ఓటరు జాబితా తయారు చేస్తున్నారు. ఈ కసరత్తులోభాగంగా గురువారం నిడమర్రు తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదలశాఖ, రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ నాగరాజు సమీక్ష నిర్వహించారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

భీమడోలు: పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తారని సీఐ యూజే విల్సన్ అన్నారు. భీమడోలులోని ఓ పాఠశాలలో గురువారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నేటి సమాజంలో పోలీసుల పాత్ర అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ యలమర్తి రవీంద్రకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్‌లు పాల్గొని ప్రసంగించారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులను అభినందించారు. ఏఎస్సై వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపవాస పండుగలు

దెందులూరు: దయ, సేవా గుణాలే క్రైస్తవ్యమని అప్పారావుపాలెం ఏసు క్రీస్తు ప్రార్థన మందిరం పాస్టర్ ఎలీషా అన్నారు. అప్పారావుపాలెంలోని ప్రార్థన మందిరంలో ఏడు రోజుల ఉపవాస ప్రార్థన పండుగల్లో భాగంగా గుంటూరు వర్తమానికులు పాస్టర్ మాథ్యూ, ఏలూరు పాస్టర్ జాన్ వెస్లీ, హోసన్నా పెంథుకోస్తు ఫెయిత్ మినిస్ట్రీస్ పాస్టర్ జెబరాజ్, రాజమండ్రి పాస్టర్ ప్రేమ్ రాజ్, అమరావతి పాస్టర్ జాన్‌లు వాక్యోపదేశం చేశారు. ఆధ్యాత్మిక చింతనతో జీవించాని సూచించారు. విశ్వాసులు, పాస్టర్లు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

గణపవరం: గణపవరం సచివాలయం–2 పరిధిలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపును జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి, డీఎల్‌డీఓ వై.దోసిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. క్యాంపు నిర్వహణ తీరును పరిశీలించారు. ఆధార్‌లో పొరపాట్లు సరిచేసుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. ఆధార్ కేంద్రానికి వచ్చిన పలువురితో ఆయన మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వై.శివరామప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా


సీహెచ్‌సీవద్ద ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

దెందులూరు: పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంతో పాటు ఆరు నెలల జీతాల బకాయిలు పారిశుద్ధ్య కార్మికుల సంఘం దెందులూరు మండలం నాయకులు పి అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం దెందులూరు సీహెచ్‌సీ వద్ద కార్మికులు ధర్నా చేశారు. బకాయి జీతాలను వెంటనే చెల్లించాలని, పీఎఫ్ విడుదల చేయాలంని కోరారు. కార్మికులు ఎ.చెంచయ్య, హిమబిందు, రజిత తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచశాంతికి యూఎన్‌ఓ కృషి


యూఎన్‌ఓ దినోత్సవంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నిర్మలకుమారి

గణపవరం: ప్రపంచశాంతికి ఐక్యరాజ్యసమితి చేస్తోన్న కృషి ఎనలేనిదని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. గురువారం ఐక్యరాజ్యసమితి ఏర్పాటు దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య ఏర్పడిన విభేదాలను రూపు మాపడంలో, పలు దేశాల మధ్య యుద్ధ వాతావరణం తొలగించి, శాంతి నెలకొల్పడంలో యూఎన్‌ఓ పాత్రను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సీహెచ్ చైతన్య, అర్థశాస్త్ర విభాగాధిపతి స్వరూపరాణి, చరిత్రశాఖాధిపతి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కైకరం విద్యార్థులు


కైకరం విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: రాష్ట్ర స్థాయి పోటీలకు కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. ఈనెల 22న ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో అండర్–17 బాలురవిభాగంలో ఎంఆంజనేయస్వామి 3 కిలో మీటర్లు పరుగులో ప్రథమ, 1500 పరుగులో ద్వితీయ, బాలికల విభాగంలో యు.మేరి, షాట్‌పుట్‌లో ద్వితీయ స్థానం, అండర్–14 విభాగంలో ఎ.సుబాష్ హైజంపులో ప్రథమ, 200 మీటర్లు పరుగులో కె.మనోజ్ ప్రథమ, కె.దీవస్ కుమార్ 100 మీటర్ల పరుగులో తృతీయ, అవుర్తల దేవకీ ప్రియంక హైజంపులో ద్వితీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు.

ప్రపంచ పోలియో దినోత్సవం


మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

దెందులూరు: ప్రపంచ పోలియో దినోత్సవాన్ని బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల విద్యార్థులు నిర్వహించారు. గురువారం గ్రామంలోని మారుమూల ప్రాంతాల్లో పోలియో చుక్కలపై అవగాహన కల్పించారు. శ్రీ కృష్ణుడి ఆలయం వద్ద విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు మాట్లాడుతూ పోలియో వ్యాధిని నిర్మూలనకు ఈ సంవత్సరం ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

యర్రమిల్లిపాడులో వైద్య శిబిరం


శిబిరంలో మాట్లాడుతున్న ఎస్సై సూర్యభగవాన్

ఉంగుటూరు: పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన పీఎంపీలు అభినందనీయులను చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ అన్నారు. గురువారం యర్రమల్లిపాడు గ్రామంలో పీఎంపీ అసోషియన్, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎసైస ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 200 మందికి 2డి ఎకో, సుగరు తదితర పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కామినేని ఆసుపత్రి, శంకర నేత్రాలయ, నిమ్మగడ్డ ఆసుపత్రి వైద్యులు సేవలు అందించారు. పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడు కొచ్చర్ల కోట శ్రీనివాసరావు, నాయకులు మరళీకృష్ణ, కాలి మంగన్న, బీఎస్‌బీ రాజు, గ్రామ సర్పంచ్ తమ్మిన శ్రీనివాసరావు, ఉపసర్పంచి రాజేష్ పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల నివారణ


మురుగు నీటి ప్రదేశాల్లో గంబూషియా చేప పిల్లలను వదులుతున్న వైద్యాధికారిణి శ్రీలక్ష్మి

భీమడోలు: గంబూషియా చేప పిల్లలను మురుగు కాల్వలో వదలడం ద్వారా దోమల నివారణ సాధ్యమని గుండుగొలను వైద్యాధికారిణి డాక్టర్ కె.శ్రీలక్ష్మి అన్నారు. జిల్లా మలేరియా విభాగం అధికారి ప్రసాద్ సూచనల మేరకు గురువారం భీమడోలు, పోలసానిపల్లి గ్రామాల్లో నీరు నిల్వ ప్రాంతాల్లో ఆమె గంబూషియా చేప పిల్లలను వదిలారు. మురుగు నీటి నిల్వలపై దోమల లార్వా వృద్ధి చెందుతుందని, తద్వారా దోమల ప్రబలి ప్రజలు అనారోగ్యంబారిన పడుతున్నారని ఆమె చెప్పారు. మలేరియా, చికెన్‌గున్యా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా ముందస్తుగా మురుగునీటి ప్రదేశాల్లో గంబూషియా చేపలను వదలడం ద్వారా దోమల లార్వా పూర్తి నిర్మూలించవచ్చని తెలిపారు. ప్రజలంతా ప్రతి శుక్రవారం తమ ఇంటి వద్ద నిల్వ నీటిని తొలగించుకోవాలని సూచించారు. ప్రజలంతా వైద్య ఆరోగ్య సిబ్బంది సూచనలను పాటించాలని కోరారు. పీహెచ్‌సీలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో డెంగీ, మలేరియాలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు కేవీఆర్ తనూజ, సీహెచ్‌ఓ ఇందిర, ఎంపీహెచ్‌ఎస్ రామకృష్ణ, ఏఎన్ఎంలు రమేష్, మురళీ, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తూడుతో నిండిన గోదావరి కాలువ


గోదావరి కాల్వలో పేరుకుపోయిన తూడు

ఉంగుటూరు: స్థానిక ఏలూరు కాలువ తూడుతో నిండిపోయింది. నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. భీమడోలు, దెందులూరు, ఉంగుటూరు మండలాల్లో శివారు భూములకు సాగునీరు అందటం గగనమవుతోంది. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఏలూరు కాల్వను ఉంగుటూరు వద్ద ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పరిశీలించారు. తూడు వల్ల కలిగే సమస్యలను బండారు మధు తదితరులు ఎమ్మెల్యేకి వివరించారు.

పాఠశాలల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి


చినరామచంద్రపురం పాఠశాలలో టాయిలెట్స్ పరిశీలిస్తున్న దోసిరెడ్డి

గణపవరం: పాఠశాలల్లో టాయిలెట్స్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్ ఇన్‌చార్జి వై.దోసిరెడ్డి అన్నారు. గురువారం ఆయన గణపవరంలోని చినరామచంద్రపురం పాఠశాలను తనిఖీ చేశారు. టాయిలెట్స్‌ను పరిశీలించారు. టాయిలెట్స్‌ను రోజుకు నాలుగు పర్యాయాలు శుభ్రం చేయించాలని, కెమికల్స్ వినియోగించాలని ఆదేశించారు. వెల్ఫేర్ అసిస్టెంట్స్ వారంలో రెండు పర్యాయాలు సోమ, గురువారాల్లో తప్పనిసరిగా పాఠశాలలను సందర్శించి టాయిలెట్స్ ఫొటోలు తీసి, ఇన్‌స్పెక్షన్ ఫారం కూడా పూర్తిచేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా, రుచికరంగా ఉండాలని, విద్యార్థులంతా పాఠశాలలోనే భోజనం చేసేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంటగదిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి, హెచ్‌ఎం మద్దా వెంకటరత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైసు మిల్లులో తనిఖీ

దెందులూరు: మండలంలోని దోసపాడులో రేషన్ మిల్లులో విజిలెన్స్ సిబ్బంది తనిఖీ చేశారు. రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు వారు తెలిపారు.

ఆక్రమణలో పంటబోదె


కైకరంలో చెత్తాచెదారంతో నిండిన పంటబోదె

ఉంగుటూరు: కై కరం ఆయకట్టులో తూర్పుపేట పంటబోదె చెత్త కూపంలా మారింది. దీంతో సాగునీరు పారక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ బోదె ఆక్రమణకు గురైంది. ఇరిగేషన్ శాఖ అధికార్లు తక్షణం స్పందించి బోదె ఆక్రమణను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఆపన్నులను ఆదుకోవడమే మానవత్వం


రోగికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

భీమడోలు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆపన్నులను ఆదుకోవడమే లక్ష్యంగా పని చేస్తోందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు అన్నారు. మండల మానవత శాఖ ఆధ్వర్యంలో గురువారం గుండుగొలనులో మృతి చెందిన పెనిగింటి పెద్దులు కుటుంబానికి, మరో ఐదు నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, దుస్తులు, ఆర్థిక సాయం, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోన్న కుర్రెళ్లగూడెం గ్రామానికి చెందిన చెన్నూ దుర్గా ప్రసాద్ వైద్యానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు అప్పకరాం బాబు, రామిశెట్టి గంగాధరరావు, మండల చైర్మన్ గుల్ల నూకరాజు, కోశాధికారి గోనుగుంట రమణశంకర్, కన్వీనర్ ఉప్పలపాటి సాయి, పెద్దలు పూడి శ్రీనివాసరావు, బంటు విజయకుమార్, కుర్రెళ్ల నారాయణస్వామి పాల్గొన్నారు.

బాణసంచా స్వాధీనం


ముండూరులో బాణసంచాను సీజ్ చేస్తున్న పోలీసులు


అప్పనవీడులో స్వాధీనం చేసుకున్న బాణ సంచా

పెదపాడు : మండలంలోని అప్పనవీడులో నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. పెదవేగి : అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు.

బాణసంచా సీజ్

పెదవేగి మండలం ముండూరు గ్రామానికి చెందిన కొనకళ్ల వెంకటకృష్ణ వేణు అనే వ్యక్తి నుంచి సుమారు రూ.20 వేల విలువ చేసే టపాసులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై చెప్పారు.

జాబ్‌మేళాలో 11 మంది ఎంపిక

ఉంగుటూరు: నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 11 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో కొలువులు సాధించారు. మొత్తం 80 మంది ఈ మేళాలో ఉద్యోగాల కోసం ప్రయత్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.ధర్మరాజు, సెట్‌వెల్ జిల్లా సీఈఓ ప్రభాకర్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగణనపై సమగ్ర సర్వే

భీమడోలు: 21వ అఖిల భారత పశుగణన 2024 సమగ్ర సర్వే ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్నట్టు భీమడోలు పశుసంవర్ధక శాఖ ఏడీ ఇ.సాయి రమేష్ తెలిపారు. భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని ఇంటింటికీ పశు సంవర్ధకశాఖ సిబ్బంది వచ్చి సర్వే చేపడతారన్నారు. పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పెంపుడు జంతువులు, కోళ్ల వివరాలను సేకరించి ఆన్‌లైన్ చేస్తారని పేర్కొన్నారు.

నేడు భీమడోలులో సర్వసభ్య సమావేశం

భీమడోలు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు. ఎంపీపీ కనుమాల రామయ్య అధ్యక్షతన ఏర్పాటుచేసే ఈ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని పేర్కొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు కొవ్వలి విద్యార్థులు

దెందులూరు: రాష్ట్ర స్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్ బాల్ అండర్–17 బాలురు, బాలికల పోటీలకు కొవ్వలి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం ప్రవీణ్ కుమార్, పి.సత్యసాయి వంశీ, జి.ఏసమ్మ ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ఎన్‌వీజీ శర్మ తెలిపారు. గురువారం పాఠశాలలో ఆయన మాట్లాడుతూ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు జక్కుల సురేష్‌కుమార్, గవ్వా శ్రీనివాసరావు నిరంతర కృషి, ప్రణాళిక, విద్యార్థుల సాధన, రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లడానికి కారణమైందని చెప్పారు. విద్యార్థులు ఈ నెల 26 నుంచి 28 వరకు పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రవీణ్ కుమార్, సత్యసాయి వంశీ, ఏసమ్మలను స్కూల్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ బీడాగణేష్, పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ ఎ.సుధారాణి అభినందించారు.

వాసిరెడ్డి పద్మ వ్యాఖ్యలపై ఆగ్రహం


మాట్లాడుతున్న రామరాజు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి వాసిరెడ్డి పద్మకు లేదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కొల్లేరు నాయకులు మోరు రామరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీ అధికార ప్రతినిధిగా, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా అత్యున్నత స్థానం కల్పించిన మాజీ ముఖ్యమంత్రిని విమర్శించిన వాసిరెడ్డి పద్మ లాంటి వ్యక్తి రాజకీయాల్లో తగదన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటిని కూడా ఎన్నో అముల చేసి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడిచి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిపై రాజకీయంగా చౌకబారు అపోహలు సృష్టించడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. కొఠారు కుటుంబం విలువలకు, విశ్వసనీయతకు, నిలువెత్తు నిదర్శనమని వివరించారు. ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని, అనంతరం ప్రజా సమస్యలు పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులు కల్పనకు కృషి చేయాలని హితవు పలికారు.ఆయన వెంట మోర్ విజయ్ ఉన్నారు.

గ్రామ సభల్లో 74 ఫిర్యాదులు


గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: మండలంలో రెవెన్యూ రీసర్వే గ్రామ సభల్లో రైతుల నుంచి 74 ఫిర్యాదులు అందాయని తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. గురువారం జోగన్నపాలెం గ్రామంలో సర్పంచ్ పసుమర్తి రాజేశ్వరి అధ్యక్షతన మండల సర్వే రమణరావు ఆధ్వర్యంలో రెవెన్యూ రీసర్వే గ్రామసభ నిర్వహించారు. రైతులు ఇచ్చిన తహసీల్దార్ ఫిర్యాదులను స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి, ఆర్ఐ హేమామాలిని, జోగన్నపాలెం వీఆర్ఓ రవి ఉన్నారు.

నేడు అక్కిరెడ్డిగూడెంలో..

అక్కిరెడ్డిగూడెం గ్రామంలో శుక్రవారం రెవెన్యూ రీసర్వే గ్రామసభ నిర్వహించనున్నట్టు తహసీల్దార్ సుమతి తెలిపారు. భూ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని రైతులను కోరారు.

కోతకు గురైన కాల్వ గట్టు


కొవ్వలి మొండికోడు వద్ద బీటలు వారిన తూరల దిమ్మె


కోతకు గురైన కాల్వ గట్టు

దెందులూరు: కొవ్వలి గ్రామంలో మొండికోడుకు వెళ్లే దారిలో కాల్వ తూరల దిమ్మె శిథిలావస్థకు చేరింది. ఒకవైపు బీటలువారి పెచ్చులూడిపోతున్నాయి. పొలాలకు వెళ్లే కాల్వ గట్టు సైతం కోతకు గురైంది. ఇరిగేషన్ డ్రెయిన్ల అధికారులు పరిస్థితిని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్


కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్ చేసిన పెదపాడు పోలీసులు

పెదపాడు : కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కట్టా శారధా సతీష్ తెలిపారు. పెదపాడు మండలంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కోళ్ల వ్యర్థాల వాహనాన్ని గుర్తించామని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు.

కోళ్ల వ్యర్థాల కేసులో ముగ్గురి అరెస్ట్

దెందులూరు: కోళ్ల వ్యర్థాను చేపల చెరువులకు వాహనాల ద్వారా సరఫరా చేస్తున్న కేసులో ముగ్గురిని అరెస్ట్ చేశామని ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. గురువారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల మండలంలోని గంగన్నగూడెం వాగు వద్ద జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న కేసులో మూడు వాహనాలు సీజ్ చేసి, ఎనిమిది మంది నిందితులకు ఐదుగురిని ఇటీవల అరెస్ట్ చేశామని తెలిపారు. మిగిలిన ముగ్గురిని త్వరలో కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై వివరించారు.

త్రో బాల్ పోటీలకు కొప్పాక విద్యార్థులు


త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీలు

పెదవేగి : రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు కొప్పాక విద్యార్థులు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి అండర్–14, –17 బాల బాలికల త్రో బాల్ పోటీల్లో కొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి కె.భువనేశ్వరి, పి.నాగ దీప్తి, ఇ.బాల మణికంఠ, జె.వెంకట్, జె.ధనుష్, పి.గౌరీ దేవి, ఎన్ లక్ష్మీ చరణ్య, పి.తరుణ్ శ్రీరామ్, ఎన్ అభిషేయ్ ఎంపికైనట్టు హెచ్‌ఎం ఆర్ శైలజ తెలిపారు. క్రీడాకారులను, పీడీ ఎం శ్రీనివాసును హెచ్‌ఎం, సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.